క్లుప్తంగా

తగ్గిన వరద నీటి ప్రవాహం



కంకిపాడు: ఏటిపాయలో వరద నీటి ప్రవాహం తగ్గింది. సోమవారం ఏటిపాయ సుమారు ఎనిమిది అడుగులు మేరకు వెనక్కి వెళ్లింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలు, వరద నీటి కారణంగా గత ఐదు రోజులుగా కృష్ణానది ఏటి పాయ ఉధృతంగా ప్రవహిస్తున్న సంగతి తెలిసిందే. బ్యారేజీ నుంచి దిగువకు నీటి విడుదలను తగ్గించటంతో ఏటిపాయలో ఉధృతి తగ్గుముఖం పట్టింది. మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల పరిధిలో ఏటి పాయ ఎనిమిది అడుగులకుపైగా నీటి ప్రవాహం తగ్గింది. కాసరనేనివారిపాలెం ఏటి ఒడ్డున ఉన్న శివాలయం ముంపు నుంచి బయటపడింది. ఏటి ఒడ్డున ఉన్న పుష్కర ఘాట్ పరిసరాల్లో సాధారణ పరిస్థితి నెలకొంది.

శివాలయం హుండీ కానుకల ఆదాయం రూ.5.73 లక్షలు

ఉయ్యూరు: ఉయ్యూరులో వేం చేసి ఉన్న శ్రీ జగదాంబ సమేత సోమేశ్వర స్వామి(శివాలయం) ఆలయం హుండీ కానుకల లెక్కింపు సోమవారం నిర్వహించారు. దేవదయ శాఖ ఉన్నతాధికారి సుబ్రమణ్యం పర్యవేక్షణలో సిబ్బంది హుండీ కానుకల లెక్కింపు చేపట్టారు. గతేడాది సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది ఆగస్టు 12వ తేదీ వరకూ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించారు. కానుకల ద్వారా రూ.5,73,921 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ ప్రసాద్ తెలిపారు.

యనమలకుదురు ఆలయంలో ప్రత్యేక పూజలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు, 8 గంటలకు, 10.30 గంటలకు స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. శ్రావణమాసం సందర్భంగా నెల రోజుల పాటు ఆలయంలో చండీహోమం నిర్వహిస్తారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి 7 గంటలకు ఆలయంలో శ్రీసాయిభక్త బృందం ఎస్.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు.

ఎంపీడీఓల బదిలీ

పెనమలూరు: పెనమలూరు ఎంపీడీఓ ఎంవీఆర్.కుమార్‌బాబు బదిలీ అయ్యారు. ఆయన ఎన్నికలకు ముందు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నుంచి బదిలీపై పెనమలూరుకు వచ్చారు. ఎన్నికలు ముగియటంతో ప్రభుత్వం బదిలీల జీఓ ఇవ్వటంతో కుమార్‌బాబు ప్రత్తిపాడుకు బదిలీ అయ్యారు. కాగా గతంలో పెనమలూరులో ఎంపీడీఓగా పని చేసి ప్రస్తుతం గుంటూరు జిల్లా పెదనందిపాడులో ఎంపీడీఓగా పని చేస్తున్న సునీతాశర్మ తిరిగి పెనమలూరుకు రానున్నారు. కాగా ఎంపీడీఓలు విధుల్లోకి చేరిన తరువాత మళ్లీ జనరల్ ట్రాన్స్‌ఫర్స్ ఉంటాయని సమాచారం.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఎస్.బసవయ్య

ఉంగుటూరు: సాధారణ ఎన్నికల్లో భాగంగా ఉంగుటూరు ఎంపీడీఓగా బదిలీపై వచ్చిన ఇ.మహేశ్వరరావు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం తిరిగి పూర్వపు జిల్లాకు సోమవారం బదిలీ అయ్యారు. దీంతో మండల పరిషత్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎస్.బసవయ్య ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు.

బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ చలసాని



గన్నవరం: గన్నవరం సబ్ డివిజన్ డీఎస్పీగా చలసాని శ్రీనివాసరావు సోమవారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన జయసూర్యను భీమవరానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఒంగోలు దిశ డీఎస్పీ చలసాని శ్రీనివాసరావును నియమించారు. ఈ మేరకు స్థానిక రాయ్‌నగర్‌లోని సబ్ డివిజన్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్‌ఐలు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. శాంతిభద్రతల పరిరక్షణలో అందరూ బాధ్యతయుతంగా పనిచేయాలని డీఎస్పీ ఆదేశించారు.

ఎస్సీ వర్గీకరణతో మూడు దశాబ్దాల కల నెరవేరింది

గన్నవరం: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో మూడు దశాబ్దాల ఎమ్మార్పీఎస్ కల నెరవేరిందని ఆ సంఘ నియోజకవర్గ ఇన్‌చార్జి మంద వేణు తెలిపారు. మండలంలోని కేసరపల్లిలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. తొలుత బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా కృష్ణమాదిగ చేస్తున్న పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ కార్యరూపం దాల్చిందన్నారు. వర్గీకరణను సాధించుకుని ఈ నెల 13న హైదరాబాద్‌కు వస్తున్న ఆయనకు స్వాగతం పలికేందుకు చేపట్టిన విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. సంఘ నేతలు కొడాలి రాజేష్, వరప్రసాద్, శేషుబాబు, బుల్లిబాబు, బుజ్జి, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగం.. అధ్వానం

- ఉపయోగంలో లేని సీహెచ్‌సీ భవనం
- అసాంఘిక కార్యకలాపాలకు నెలవు
- పట్టించుకోని వైద్య ఆరోగ్య శాఖ



కంకిపాడులోని సీహెచ్‌సీ పాత భవనం

కంకిపాడు: ప్రభుత్వ ఆస్పత్రిని నూతన భవనంలోకి మార్పు చేయడంతో ఆస్పత్రి పాత భవనం నిరుపయోగంగా మారింది. పాత భవనంలో ఒకప్పుడు ప్రతి నిత్యం 200 మందికి పైగా రోగులకు వైద్య సేవలు పొందేవారు. పాత భవనాన్ని గాలికొదిలేశారు. దీంతో భవనం పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా తయారైంది. విలువైన భవనాన్ని నిరుపయోగంగా మార్చేయటంతో ప్రజలు విస్మయం చెందుతున్నారు.

విష సర్పాలు, కీటకాలకు ఆవాసం..

కంకిపాడు పట్టణంలోని నడిబొడ్డున ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుచేశారు. 2010లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అప్‌గ్రేడ్ అయ్యి సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్పు చేశారు. తదనుగుణంగా సిబ్బంది పెంపుదల జరగటం, అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి రావటంతో నిత్యం 200 మందికి పైగా ప్రజలు వైద్య సేవలను పొందేవారు. దాతల వితరణతో సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం నిర్మాణానికి స్థలం లభించటం, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.4.60 కోట్లు నిధులు కేటాయించటంతో కంకిపాడు పట్టణంలో అధునాతన వైద్య సేవలతో సామాజిక ఆరోగ్య కేంద్రం భవనం నిర్మించారు. దీంతో పాత భవనంలో నడుస్తున్న ఆస్పత్రిని నూతన భవనంలోకి మార్చారు. ఏడాదిపైగా నూతన ఆసుపత్రిలో వైద్య సేవలు అందుతున్నాయి. అప్పటి నుంచి పాత భవనాన్ని అధికారులు వదిలేశారు. భవనం పూర్తిగా నిరుపయోగంగా తయారైంది. గతంలో కురిసిన భారీ వర్షాలకు ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న భారీ వృక్షం కూలిపోయింది. రోగులు వేచి ఉండేందుకు నిర్మించిన షెడ్డు ధ్వంసమైంది. విష సర్పాలు, కీటకాల సంచారానికి ఆవాసంగా తయారైంది. పట్టణంలో నడిబొడ్డున విలువైన భవనాన్ని వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యామ్నాయ వనరుగా వినియోగించకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంది. దీంతో రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారటంతో ప్రజలు అధికారుల నిర్లక్ష్యతీరుపై మండిపడుతున్నారు. భవనాన్ని అందుబాటులోకి తేవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

భవనాన్ని వినియోగంలోకి తేవాలి..



ఎంతో విలువైన స్థలం, భవనం పట్టణంలో ఉన్నాయి. స్వల్ప మరమ్మతులు చేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా సేవలు అందించేందుకు భవనాన్ని తీర్చిదిద్దవచ్చు. ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ దృష్టి సారించాలి. ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

– మేదంద్రావు కుటుంబరావు, సీహెచ్‌సీ మాజీ చైర్మన్, కంకిపాడు

యనమలకుదురులో అభివృద్ధి పనుల ప్రారంభం



తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ యనమలకుదురు గ్రామంలో సోమవారం రూ.20 లక్షల విలువ చేసే అభివృద్ధి పనులు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించారు. యనమలకుదురు పాత గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తడటంతో రూ.20 లక్షలతో బోరు, పైప్‌లైన్ వేసి చప్టాల నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామంలో చాలాకాలంగా ఉన్న మంచినీటి సమస్య పరిష్కరించామన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. తాడిగడప మున్సిపాలిటీని అభివృద్ధి పథంలోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, టీడీపీ నేతలు వెలగపూడి బాబూరావు, వెలగపూడి శంకర్‌బాబు, అనుమోలు ప్రభాకరరావు, అనంతనేని ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



ఉయ్యూరు: మార్షల్ ఆర్ట్స్ అండ్ మాస్టర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఉయ్యూరు విద్యార్థులు సత్తా చాటారు. విజయవాడలో ఆదివారం కుంగ్ ఫూ, కరాటే విభాగాల్లో ఓపెన్ కేటగిరీలో ఉయ్యూరుకు చెందిన నివాస్ కరాటే మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు పాల్గొన్నారు. కటా, టీం కటా, కుమితే విభాగాల్లో ప్రతిభ కనబర్చి 17 బంగారు పతకాలు, నాలుగు వెండి, రెండు కాంస్య పతకాలు గెలుచుకున్నారని కరాటే కోచ్ శ్రీనివాస్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉయ్యూరు: మండలంలోని కాటూరు, పెద ఓగిరాల సబ్‌స్టేషన్ల పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ కృష్ణనాయక్ తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు సబ్‌స్టేషన్ల పరిధిలోని ఆకునూరు, చిన ఓగిరాల, కాటూరు, పెద ఓగిరాల గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రోత్సాహకాల పంపిణీ



విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేస్తున్న దాత బుచ్చిబాపయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ ఆధ్వర్యంలో బాపులపాడు మండలం ఆరుగొలనులోని జెడ్పీ హైస్కూల్‌లో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆరు నుంచి 10వ తరగతి వరకు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిల్చిన విద్యార్థులకు లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు మేడికొండ బుచ్చిబాపయ్య సహకారంతో నగదు ప్రోత్సాహకాలను సోమవారం పంపిణీ చేశారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన పాఠశాల విద్యార్థులకు క్రీడా వస్తువులను అందజేశారు. పేద విద్యార్థులకు, విద్యాభివృద్ధికి, గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని బుచ్చిబాపయ్య చెప్పారు. పాఠశాల హెచ్‌ఎం దుర్గాప్రసాద్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కళ్లేపల్లి నారాయణరావు, సీనియర్ సభ్యులు నందిగం స్వామి, మూల్పూరు సురేంద్ర, రవీంద్రనాథ్ చౌదరి, మాకినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటుపై నిరసన



ఉయ్యూరులో డీవైఈఓ పద్మారాణికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఉయ్యూరు: ఉపాధ్యాయుల అసంబద్ధ సర్దుబాటు ప్రక్రియ నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాలు సోమవారం ఉయ్యూరులో నిరసన వ్యక్తం చేశాయి. డీవైఈఓ పద్మారాణి కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. డీవైఈఓ పద్మారాణి, ఎంఈఓ సుధారాణిలకు వినతిపత్రం అందజేశారు. ఫ్యాప్టో సూచనలను పరిగణనలోకి తీసుకుని డిమాండ్లు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు లంకేష్, రమణ, సుగుణాకర్‌రావు, ఇమ్మానుయేలు, లక్ష్మీ, శ్రీధర్, షేక్ సిలార్, అబ్దుల్ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ నంబర్ 53 అమలు చేయాలి



కంకిపాడులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

కంకిపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో సమాంతర తెలుగు మాధ్యమం పునరుద్ధరించాలని, ఉపాధ్యాయుల సర్దుబాటు జీఓ నంబర్ 53 ప్రకారం చేపట్టాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కంకిపాడులో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ వి.భావన్నారాయణకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. జీఓ నంబర్ 117 ప్రకారం సర్దుబాటు చేయకుండా ఆ స్థానంలో జీఓ నంబర్ 53 వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు మండవ శ్రీనివాస్, పి.సురేష్‌బాబు, బుచ్చయ్యబాబు, సీహెచ్ నారాయణమూర్తి, ముచ్చింతల శ్రీనివాస్, శొంఠి మాధవరావు, కేబీకే గోపాల్, మాధవరావు, పి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వమే సరఫరా చేయాలి



ఎంఈఓ సాంబశివరావుకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఉంగుటూరు: మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు అవసరమైన గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని కోరుతూ సీఐటీయూ, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం నాయకులు ఎంఈఓ–2 సాంబశివరావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షురాలు కోటేశ్వరి మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాలుగా ఇదే వృత్తిని నమ్ముకుని పని చేసే కార్మికులను కొన్ని పాఠశాలల్లో తొలగిస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిందని తమ వారిని పనిలో పెట్టుకోవాలని అధికార పార్టీ వారు మాట్లాడటం సరికాదని చెప్పారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ లక్ష్మణస్వామి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కొనసాగించాల్సిన మధ్యాహ్న భోజనం పథకానికి నిధులు కేటాయింపులో అలసత్వం వహిస్తున్నారన్నారు. మెనూ చార్ట్ మాత్రం ఆకర్షణీయం.. చెల్లింపు మాత్రం ఎక్కడి గొంగడి అక్కడే అనే చందంగా తయారైందని చెప్పారు. మెనూ అమలు చేయటానికి ఏజెన్సీ నిర్వాహకులు పుస్తెలు తనఖా పెట్టి అమలు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు కె.రామరాజు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు, సంఘ కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

బిల్లు ధరకే గ్యాస్ సరఫరా చేయాలి

కంకిపాడు: గ్యాస్ ఏజెన్సీకి ఐదు కిలోమీటర్ల లోపు ఉన్న గ్రామాల్లో వినియోగదారులకు బిల్లు ధరకే గ్యాస్ సిలెండర్లను సరఫరా చేయాలని నూర్‌బాషా ముస్లిం సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా విజ్ఞప్తి చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వి.భావన్నారాయణను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. చిన్నా మాట్లాడుతూ.. గ్యాస్ ఏజెన్సీ కార్మికులు, యజమానులు అడ్డగోలుగా వ్యవహరిస్తూ వినియోగదారులను దోచుకుంటున్నారని విమర్శించారు. ఏజెన్సీ నిర్వాహకులపై దృష్టి సారించి బిల్లు ధరకే గ్యాస్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్సార్కే కళాశాలలో ప్రత్యేక ఆధార్ క్యాంపు



ఆధార్ కార్డుల్లో తప్పులు సవరణ చేసుకున్న విద్యార్థులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ప్రత్యేక ఆధార్ క్యాంపును నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు రామవరప్పాడు నుంచి వచ్చిన బృందం క్యాంపు ఏర్పాటు చేసి సమస్యలు ఉన్న ఆధార్ కార్డుల్లో సవరణలు చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందికి సంబంధించిన ఆధార్ కార్డులలోని తప్పులను తగిన ఆధారాలతో సరి చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ.. అందరికీ ఉపయోగపడే కార్యక్రమం కళాశాలలో నిర్వహించడం సంతోషకరమన్నారు. కళాశాలలో 150 మందికి పైగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో పలు విభాగాల హెచ్‌ఓడీలు, ఏఓ బి.ప్రతాప్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డి.సుబ్బారావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ చిన్ని తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



రహదారి నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ, సర్పంచ్ బాలాజీ గంగారత్నం

రామవరప్పాడు: నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో సోమవారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. గ్రామంలోని యాదవుల బజారు నుంచి సీబీసీఎన్‌సీ చర్చి వరకు సుమారు రూ.60 లక్షలతో నిర్మించే రహదారి, డ్రెయిన్ అభివృద్ధి పనులకు సర్పంచ్ సర్నాల బాలాజీ గంగారత్నంతో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు.

టీడీపీ జెండా ఆవిష్కరణ..

ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఇటీవల సీఎం చంద్రబాబు నాయుడిని కలిసి పలు అంశాలపై చర్చించానని తెలిపారు. గ్రామ సర్పంచ్ సర్నాల బాలాజీ గంగారత్నం మాట్లాడుతూ గ్రామంలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామానికి ప్రధాన రహదారైన యాదవుల బజారును అభివృద్ధి చేసేందుకు పంచాయతీ నిధులు రూ.60 లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. అలాగే రైవస్ కాలువ కట్ట రోడ్డు, సెయింట్ ఆన్స్ పాఠశాల వెనుక రోడ్డు కూడా అభివృద్ధి చేసేందుకు ప్రపోజల్స్ పెట్టామన్నారు. అనంతరం సొసైటీ బ్యాంకు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన టీడీపీ దిమ్మెను ఎమ్మెల్యే వెంకట్రావు ప్రారంభించి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సువర్ణరాజు, గూడవల్లి నరసయ్య, యూత్ నాయకులు సర్నాల బాలాజీ, పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



గంపా నాగేశ్వరరావుకు జ్ఞాపికను అందజేస్తున్న విద్యార్థులు

పెనమలూరు: విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఇంపాక్ట్ ఫౌండేషన్ నిర్వాహకుడు, నిపుణుడు గంపా నాగేశ్వరరావు తెలిపారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో ఎంపవర్ అండ్ ఎన్‌రిచ్ అనే అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న నాగేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులు నైపుణ్యం పెంపొందించటం, సృజనాత్మకతను చూపటంతో రాణించగలుగుతారన్నారు. వ్యక్తిత్వ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీన్ చావా శ్రీనివాస్, ఫస్టియర్ విద్యార్థుల ఇన్‌చార్జి బేబీరాణి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, ఇంగ్లిష్ విభాగాధిపతి రవిచంద్, విద్యార్థులు పాల్గొన్నారు. గంపా నాగేశ్వరరావును సన్మానించారు.

పీవీపీ సిద్ధార్థలో..

పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో క్లాస్ రూమ్ టూ బోర్డ్ రూమ్ కార్యక్రమాన్ని గంపా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అకడమిక్ థియరీని వాస్తవ ప్రపంచానికి అనుగుణంగా అనుసంధానం చేయటానికి నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ విజయానికి చాలా కీలకమన్నారు. ప్రతి విద్యార్థికి స్పష్టమైన దృక్పథం ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, ప్రొఫెసర్లు డాక్టర్ లక్ష్మి, కృపశ్రీ, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు



మాట్లాడుతున్న ఈఈ హరిబాబు

పెనమలూరు: విద్యుత్ వినియోగదారులు నిబంధనల ప్రకారమే విద్యుత్ వినియోగించాలని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. పోరంకి సెక్షన్‌లో సోమవారం విద్యుత్ విజిలెన్స్ శాఖ ఆధ్వర్యంలో 36 టీమ్‌లు తనిఖీలు నిర్వహించాయి. విద్యుత్ వినియోగదారులు వారికి కేటాయించిన విధంగానే లోడ్ వినియోగించాలన్నారు. అదనపు విద్యుత్ లోడ్ వినియోగిస్తే డిపాజిట్ చెల్లించాలని సూచించారు. విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమన్నారు. విజిలెన్స్ తనిఖీ టీమ్‌లు గ్రామంలో విద్యుత్ తనిఖీలు చేశారు. అదనపు లోడ్ వినియోగిస్తున్న వినియోగదారుల నుంచి రూ.3 లక్షల రుసుం విధించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఈఈ జి.కమలకుమారి, డెప్యూటీ ఈఈ బి.నవీన్‌కుమార్, పోరంకి ఏఈ పి.సాంబశివరావు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ దాడుల్లో రూ.6.95 లక్షల జరిమానా

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి రూ.6,95,680 జరిమానా విధించినట్లు విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడి చేశారు. మండలంలోని ఆముదాలపల్లి, ఉంగుటూరు, గారపాడు, ముక్కపాడు, కొయ్యగురపాడు, వేంపాడు, తరిగొప్పల, వేమండ, మానికొండ, నందమూరు, ఇందుపల్లి, లంకపల్లి, వెల్దిపాడు గ్రామాల్లో గృహ, వాణిజ్య సముదాయాలు, ఆక్వా చెరువుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని చెప్పారు. అధికారులు 46 బృందాలుగా ఏర్పడి 2,477 గృహ సర్వీసులు, 164 వాణిజ్య సముదాయాలు, ఇతర 18 సర్వీసులను తనిఖీ చేయగా వాటిలో 210 సర్వీసులకు అదనపు లోడు 297 కిలోవాట్‌కు రూ.6,95,680 జరిమానా విధించామన్నారు. విద్యుత్ చౌర్యం జరిగితే 94408 12362, 83310 14951 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గుడివాడ ఈఈ పి.రామకృష్ణ, డీఈఈ డి.శ్రీనివాసరావు, ఏఈ సూర్యప్రకాశరావు, డివిజన్‌లోని ఏడీ, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

గంగూరు రహదారి అభివృద్ధి చేయాలని వినతి

పెనమలూరు: గంగూరు గ్రామ ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలని గ్రామానికి చెందిన షేక్.షాబుద్దీన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. గ్రీవెన్స్ డే సందర్భంగా సోమవారం పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కుమార్‌బాబుకు వినతిపత్రం అందజేసి వివరాలు తెలిపారు. గ్రామ ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి గుంతలు పడి అధ్వానంగా మారిందన్నారు. కాలేజీలు, పాఠశాలలు, పరిశ్రమలు ఈ ప్రాంతంలో ఉన్నందున ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి రహదారి అభివృద్ధి చేయాలని కోరారు.

ఉద్యాన రైతులకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలు



చనుపల్లివారిగూడెంలో పంటలు పరిశీలిస్తున్న హెచ్‌ఓ హరిచంద్

గన్నవరం రూరల్: మండలంలోని మాదలవారిగూడెం, చనుపల్లివారి గూడెం గ్రామాల్లో ఉన్న ఉద్యానవన పంటలను సోమవారం మండల ఇన్‌చార్జి హార్టికల్చర్ అధికారి హరిచంద్ పరిశీలించారు. రైతులు ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీలు వినియోగించుకోవాలని సూచించారు. ఉద్యానవన శాఖ ద్వారా డ్రిప్, స్ప్రింక్లర్లు ఇస్తున్నట్లు చెప్పారు. సబ్సిడీపై అందజేసే వీటిని తీసుకునేందుకు గ్రామ సేవా కేంద్రంలో బయోమెట్రిక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఫీల్డ్ మ్యాప్, ఆర్ఓఆర్ వన్‌బీ తీసుకుని రైతులు సేవా కేంద్రంలో వ్యవసాయ, హార్టికల్చర్ సహాయకులను కలిసి సబ్సిడీపై ప్రభుత్వం అందించే డ్రిప్ పరికరాలు పొందాలని చెప్పారు.